# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-06-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులకు పద్మ పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అందజేశారు.**

2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు కర్నూలు జిల్లాలో పర్యటిస్తారు.**

3. **తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి పలువురు కేంద్ర మంత్రులతో చర్చలు జరిపారు.**

4. **రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటును మరింత వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్య శాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు.**

==========================

వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులకు పద్మ పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అందజేశారు. రాష్ట్రపతి భవన్ లో నిన్న జరిగిన ఈ వేడుకకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, స్పీకర్ ఓం బిర్లా, హోం మంత్రి అమిత్ షా తదితరులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుండి సినీ ప్రముఖులు రాజేంద్ర ప్రసాద్, మురళీ మోహన్ పద్మశ్రీ పురస్కారాన్ని, క్యాన్సర్ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయుడు పద్మ విభూషణ్ పురస్కారాన్ని రాష్ట్రపతి నుంచి అందుకున్నారు. తెలంగాణ నుండి దీపికా రెడ్డి పాలకొండ విజయ్ ఆనంద్ రెడ్డి, గూడురు వెంకట్ రావు, చంద్రమౌళి గడ్డమనుగు, కృష్ణమూర్తి బాలసుబ్రమణ్యం, కుమార స్వామి తంగరాజ్ తదితరులు పద్మ పురస్కారాలను అందుకున్న వారిలో ఉన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు కర్నూలు జిల్లాలో పర్యటిస్తారు. తుగ్గలి మండలం జొన్నగిరిలో ఏర్పాటు చేసిన గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును ప్రారంభించడంతో పాటు, ప్లాంట్ విస్తరణలో భాగంగా రెండో యూనిట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. పర్యటనలోభాగంగా ముఖ్యమంత్రి అమరావతి నుంచి ఉదయం బయలుదేరి జొన్నగిరికి చేరుకుంటారు. గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభోత్సవం, శంకుస్థాపనల అనంతరం జొన్నగిరిలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. 405 కోట్ల రూపాయల పెట్టుబడితో రెండు ప్రైవేటు సంస్థలు గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును ఏర్పాటు చేశాయి. జొన్నగిరి కార్యక్రమాల అనంతరం మధ్యాహ్నం పత్తికొండ నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు.

--------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-1 స్వాధీనం, ఫేజ్-2 విస్తరణకు సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రులతో నిన్నచర్చలు జరిపారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్ నివాసంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వని వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి లతో కలిసి ముఖ్యమంత్రి మెట్రో ప్రాజెక్టుపై నిన్న చర్చించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 విలువ నిర్ధారణ, స్వాధీన ప్రక్రియ, రుణాల సమీకరణ, రుణ సంస్థ ఎంపిక, ఫేజ్-2 విస్తరణ నిర్మాణ వ్యయం తదితర అంశాలపై సమగ్ర అధ్యయనం నిర్వహించేందుకు కన్సల్టెంట్‌ను నియమించాలని నిర్ణయించారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 10 మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఎచ్చెర్ల, నక్కపల్లి, మాచర్ల, గిద్దలూరు, గుంతకల్లు, రాయచోటి, పత్తికొండ, మంత్రాలయం, పెనుకొండ, కదిరి ప్రాంతాల్లో ఈ విద్యాసంస్థలు ఏర్పాటు కానున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రివర్గ సమావేశం వివరాలను సమాచార శాఖ మంత్రి పార్థసారధి పాత్రికేయులకు తెలియజేస్తూ.. ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీలు, కార్పొరేషన్లలో పని చేస్తున్న ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని అన్నారు. అనేక సంస్థలు రాష్ట్రంలో డేటా సెంటర్లు, ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. టూరిస్ట్ బస్సులపై విధించే త్రైమాసిక పన్నును తగ్గించినట్లు మంత్రి పేర్కొంటూ..

..వాయిస్..30.. సెకన్లు

---------------------------

రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటును వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్య శాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం గుంటూరు జిల్లా ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో నిన్న నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్ హాజరవగా, టిజి భరత్ దృశ్యమాధ్యమ విధానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో "స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్"కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కిరాణా దుకాణం నుంచి డేటా సెంటర్ వరకు అన్ని రకాల వ్యాపారాలకు ఒకే వేదిక ద్వారా అనుమతులు మంజూరు చేసే సింగిల్ పోర్టల్ వ్యవస్థను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి మూడు రోజుల పర్యటన నిమిత్తం కడప జిల్లా పులివెందులకు నిన్న చేరుకున్నారు. భాకరాపురంలోని క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి పార్టీ శ్రేణులు, వివిధ వర్గాల ప్రజలను కలిసి వారి సమస్యలను తెలుసుకుని, వినతిపత్రాలను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైయస్ జగన్మోహన్ రెడ్డిని పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి పార్టీ కార్యక్రమాలు, స్థానిక పరిస్థితులపై చర్చించారు.

---------------------------

ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంతో కొత్తపట్నంతో పాటు మొత్తం తీర ప్రాంత ముఖచిత్రమే మారిపోతుందని ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తో కలిసి ఆయన నిన్న పల్లెపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రానికి నాలుగు హార్బర్లు మంజూరు కాగా, వాటిలో ఒకటి కొత్తపట్నం మండలానికి ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. హార్బర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున నిర్మాణ వ్యయంలో అధిక వాటా భరిస్తున్నట్లు ఎంపి పేర్కొంటూ..

వాయిస్...30 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 135వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.“మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, లేదా మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 26వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా ఐదేళ్లలోపు వయస్సు గల 49 లక్షల 20 వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై దృశ్యమాధ్యమ సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొత్తం 29 వేల 873 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేయగా, వలస కుటుంబాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాల్లోని చిన్నారులను చేరుకునేందుకు వెయ్యి 757 ప్రత్యేక బృందాలు నియమించినట్లు తెలిపారు. అలాగే బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు తదితర ప్రాంతాల్లో వెయ్యి 144 ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమ నిర్వహణలో లక్షా 31 వేల మంది సిబ్బంది పాల్గొననున్నట్లు వెల్లడించారు.

---------------------------

రాయలసీమ నుండి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు విస్తరించి ఉన్న ద్రోణి బలహీనపడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్ర ప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణములో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని, వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈ రోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్నిచోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్ర అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశ ముందని పేర్కొంటూ..

వాయిస్..25.. సెకన్లు

మరోవైపు తెలంగాణలో ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అనేక ప్రాంతాల్లో కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆదిలాబాద్, కుమురం భీమ్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని పేర్కొంది.

=====================